# బిడియం

[గల్పిక]

శారద బి. ఏ. ప్యాసయినప్పటికీ చాలామంచిది. అంటే ఆమెఎన్నడూ అవినీతిగా ప్రవర్తించి ఎరగదు. ఆమెమనస్సు పరపురుషులమీద పోలేదని కాదు. ఒక్కోసారి తనఒంటో ఉన్న నరనరమూ ఒక్కో పరపురుషుడికోసం పీకేది. కాని ఆ నరాల పీకుడు కార్యరూపం ధరించలేదు. భగవంతుడు తనశీలాన్ని కాపాడుతూవచ్చాడు. తనప్రేమకు తాత్కాలికంగా పాత్రులు కాగావచ్చిన మగవాళ్లెప్పటికప్పుడు తన మనస్సులోంచి రాలిపోయినాడు.

అయితే శారదభర్తకూడా ఆపరాయి వాళ్ళతోపాటు ఎన్నడో ఆమెమనస్సులోంచి రాలిపోయినాడు...

అయితే ఆమెకిప్పుడు సందేహంపట్టుకుంది. తను పరపురుషుడి మొహం ఎరక్కుండాచావటం చాలాగర్వపడదగ్గ విషయమా? లేక, రహస్యంగా సిగ్గుపడదగ్గ విషయమా? ఈవిషయం తేల్చుకోవలసిన అవసరం కలిగింది శారదకు. పై ప్రశ్నకు వచ్చేసమాధానంమీద ఆమెప్రవర్తన ఆధారపడబోతున్నది.

ఎందుకంటే, ఆకుర్రాడు, శాస్త్రి, తనను గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఏమీసందేహంలేదు. పదిహేడేళ్లకుర్రాడు శాస్త్రి నలిగిన అందాన్నిమాత్రమే చూడగలు! అంచేత వాళ్ళ మనస్సు ఇరవైఏడేళ్ల స్త్రీమీద పోతుంది.

తనకు శాస్త్రిమీద మనస్సుపోయిందని కాదు. ఎబ్బే! పాపం, పసివాడు, పాలుగారేమొహమూ, తియ్యని పది

మలూ, తడికళ్లూ, రానిమీసాలూ, కళ్ళమీదపడే క్రాపూ, సన్నని నడుమూ...ఛీ, ఛీ! తనకాఅబ్బాయిమీద భ్రమ ఎందు కుంటుందీ?

కాని ఆకుర్రాడి స్వర్గసౌఖ్యం తనఅరిచేతిలోఉంటే అది అతనికివ్వటం ఉచితమా, కాదా? తన ధర్మమా, కాదా? బి. ఏ. పాసయిన తనకు నిరపాయకరమైన ఒక చిన్నతప్పు చేసే అధికారంఉందా, లేదా? ఒకవేళ తను ఆకుర్రాణ్ణి విరహాగ్ని వాత వేసి తనుపదహారణాల పాతివ్రత్యం దక్కించుకున్నప్పటికీ, ప్రపంచం తనపదహారణాల పాతివ్రత్యంలో విశ్వాసం ఉంచుతుందనే ఆశఉన్నదా?

* * *

"ఏమిటి, శాస్త్రీ, ఏదోఅనబోయినావే! నే నేమీ అనుకోను లేచెప్పు!" అన్నదిశారద ప్రోత్సాహకరంగా నవ్వుతూ.

అయిదునిమిషాలనించి నీళ్లునములుతున్న శాస్త్రి పెదిమలు నాక్కుని అధికసాహసంతో నోరువిప్పాడు—

"ఈనెల ఇంతవరకూ మానాన్న డబ్బుపంప లేదు. పదిహేనురూపాయిలు కావాలి. అడగటానికి సిగ్గుగా ఉంది!"

——